# సాక్షి కర్నూలు

ఆదివారం। 5। అక్టోబర్। 2025




## 'జల'కేతనం

అంతర్రాష్ట్ర కనోయింగ్ కయాకింగ్ చాంపియన్‌షిప్ పోటీలు కర్నూలు సిటీ ఫారెస్ట్ చెరువులో హోరాహోరీగా సాగాయి. పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటారు. 8లో▸



## విజయం విరాజిల్లి

తెర్నేకల్.. తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గ్రామం. స్వాతంత్య్రం కోసం ప్రాణ త్యాగం పౌరుషాల గడ్డ. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల అడ్డాగా మారింది. 8లో▸



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం | :1,633 అడుగులు |
| ప్రస్తుతం | :1,626.06 |
| టీఎంసీల సామర్థ్యం | :105.788 |
| ప్రస్తుతం | :80.003 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :14,268 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | :13,961 |

## న్యూస్‌రీల్

### గ్రేడ్ -6 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి



ఎస్‌ఆర్‌లను పరిశీలిస్తున్న డీపీఓ భాస్కర్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 122 మంది గ్రేడ్ -6 పంచాయతీ కార్యదర్శులకు(డిజిటల్ అసిస్టెంట్స్) గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ శనివారం సాయంత్రం ప్రారంభమైంది. పదోన్నతులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆమోదం తెలిపిన నేపథ్యంలో స్థానిక డీపీఓ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ అర్హుల జాబితాలతో పాటు ఎస్‌ఆర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు నెలలో ఉమ్మడి జిల్లాలోని 120 మంది గ్రేడ్ - 5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించి పోస్టింగ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామ సచివాలయాల్లో ఖాళీ ఏర్పడిన గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శుల పోస్టులను ప్రస్తుత పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తున్నామన్నారు. పదోన్నతులు పొందిన వారికి సొంత మండలంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో పోస్టింగ్స్ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీపీఓ కార్యాలయ పరిపాలనాధికారి ప్రతిమ పాల్గొన్నారు.

### ఆకాశం.. రుధిర వర్ణం



సి.బెళగల్: 'ఓయ్.. సెక్రటరీ అటు చూడు.. ఆకాశం నెత్తురు గడ్డలా లేదు' అదేదో సినిమాలో రావుగోపాలరావు డైలాగ్ ఇది. ఆకాశంలో ఇటువంటి దృశ్యమే శనివారం సాయంత్రం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో కనిపించింది. ప్రకృతిలో చోటుచేసుకున్న మార్పును ప్రజలు వింతగా చూశారు. క్రిష్ణదొడ్డి దారిలోని చెరువు దగ్గర ఈ దృశ్యాన్ని కొందరు సెల్ ఫోన్లలో తీసుకున్నారు.

### చెరువులన్నింటిలో నీరు ఉండాలి

- జల వనరుల శాఖ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి

కర్నూలు సిటీ: చిన్న నీటిపారుదల శాఖ పరిధిలోని చెరువులన్నింటిలో నీరు ఉండాలని ఇంజినీర్లకు జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి సూచించారు. జల మండలిలోని తన చాంబర్‌లో శనివారం ఎస్‌ఈ సమీక్ష నిర్వహించారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల్లో నీటిని నింపేందుకు అవసరమైన ఫీడర్ చానల్స్‌ను శుభ్రం చేసేందుకు అంచనాలు వేయాలన్నారు. జిల్లాలోని 246 చెరువుల్లో ఎంత నీరుందో అడిగి తెలుసుకున్నారు. హంద్రీ నీవా ద్వారా 68 చెరువుల్లో నీటిని నింపేందుకు రూ.1.30 కోట్లకు అంచనాలు వేశామని, ఇటీవలే మరోసారి మార్పులు చేసి పంపించామని నిధులు వచ్చేలా చూడాలని ఇంజినీర్లు కోరారు. చెరువుల్లో నీటిని నింపేందుకు 11 పనులకు రూ.54 లక్షలకు అంచనాలు వేసి అనుమతులకు జిల్లా కలెక్టర్‌కు పంపించినట్లు చెప్పారు. సమావేశంలో చిన్న నీటిపారుదల శాఖ ఈఈ, డీఈఈ, ఎఫ్‌ఆర్‌ఎల్ ఈఈ, డీఈఈ, తదితరులు పాల్గొన్నారు.

# కంటి'పాప'లే.. నలుసులై!

- తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు
- ఆస్తులు తీసుకుని ఇంటి నుంచి వెళ్లగొడుతున్న వైనం
- వృద్ధులకు అనేక కష్టాలు
- పీజీఆర్‌ఎస్‌కు ప్రతి వారం వస్తున్న ఫిర్యాదులు
- సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందుల్లో పండుటాకులు

కర్నూలు(సెంట్రల్): పిల్లల కోసం తల్లిదండ్రులు సర్వం త్యాగం చేస్తారు. తమకు కొత్త దుస్తులు లేకపోయినా వారికి కొత్తవి కొనుగోలు చేసి ఆనంద పడతారు. 'ప్రపంచంలో తన కుమారులు, కుమార్తెల కంటే ఎవరూ గొప్పవారు కాదు' అని గర్వంగా చెప్పుకుంటారు. వారు ఎన్ని తప్పులు చేసినా కడపులో దాచుకుంటారు. కష్టాలు వచ్చినా భరిస్తూ వారిని పెద్ద చేస్తారు. అయితే ఇంత చేసినా తల్లిదండ్రులు జీవిత చరమాంకంలోకి వచ్చేసరికి పిల్లలకు బరువైతున్నారు. వారిని అనాథలుగా వదిలి వెస్తున్నారు. జీవితంలో ఎవరితో ఒక్కమాట అనిపించుకోకుండా కష్టాన్నే నమ్ముకొని బతికిన తల్లిదండ్రులకు చివరి దశలో పిల్లల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. కనీసం కూడు..గూడు కోసం వెంపర్లాడాల్సి వస్తోంది.

### పీజీఆర్‌ఎస్ వచ్చే సమస్యలో పది శాతం అవే!

కర్నూలులోని కలెక్టరేట్, జిల్లా ఎస్పీ, సబ్ డివిజినల్ అధికారులు, తహసీల్దార్లు, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోంది. ఇందులో వచ్చే సమస్యల్లో దాదాపు 10 శాతం వృద్ధ దంపతులకు చెందిన ఫిర్యాదులే ఉంటున్నాయి. వీటిని పరిష్కరించడం అధికారులకు కూడా తలనొప్పే. అయితే వారు మానవత్వంతో వృద్ధుల పక్షాన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఆ దిశగా చర్యలు కనిపించడలేదు. ఎక్కువగా పిల్లల నుంచి ఇబ్బందులు ఉంటున్నాయని వచ్చే కేసులపై పోలీసులను ఆశ్రయించాలని రెఫర్ చేస్తున్నారు. దీంతో అక్కడికి వెళ్లిన వృద్ధులకు చేదు అనుభవాలే కలుగుతున్నాయి. పోలీసుల నుంచి అనుకున్న న్యాయం దొరకడంలేదు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు సుశీలమ్మ. ఈమెది కోడుమూరు మండలం వర్కూరు. ఈమె భర్త మృతిచెందగా ఇద్దరు కుమార్తెలను పెంచిపోషించారు. వారికి పెళ్లిళ్లు, కాన్పులు చేశారు. మనువళ్లు, మనువరాళ్ల సంతోషం చూశారు. అయితే ఆమెను ఇప్పుడు ఒంటరిని చేశారు. ఇంటి నుంచి వెళ్లగొట్టారు. భర్త నుంచి వారసత్వంగా వచ్చిన ఇంటిని తనకి ఇప్పించాలని ఈమె కోరుతూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధ దంపతుల పేర్లు యంకన్న, అంజినమ్మ. వీరిది కోడుమూరు మండలం పులకుర్తి. వీరికి ఇద్దరు కుమారులు. దాదాపు 20 ఎకరాల పొలాన్ని కుమారులకు ఇచ్చారు. అయితే ఇప్పుడు కుమారులు, కోడళ్లు, మనువళ్లు, మనువరాళ్లు ఆ వృద్ధులను ఇంటి నుంచి గెంటేశారు. కనీసం తిండి పెట్టమంటే పెట్టడంలేదు. జీవిత చరమాంకంలో వారికి దిక్కుతోచడంలేదు. అనారోగ్యంతో బాధపడుతున్న వీరు.. తమ పిల్లలు అన్నం పెట్టడంలేదని కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు.

ప్రతి సోమవారం కలెక్టరేట్, ఆర్‌డీఓ, తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు వందలాది మంది వృద్ధులు అర్జీలు పట్టుకుని వస్తున్నారు. తమ పిల్లలు చూసుకోవడంలేదని, భోజనం పెట్టడంలేదని, ఇంటి నుంచి గెంటివేశారని, చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు. అయితే వారి నుంచి సరైన న్యాయం వారికి దొరకడంలేదు. ఇక్కడి నుంచి రెఫర్ టూ తహసీల్దార్ లేదా పోలీసులను ఆశ్రయించాలని చెబుతున్నారు. దీంతో వృద్ధులు నిరాశతో తిరిగివెళ్తున్నారు.

### పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన సమస్యల్లో కొన్ని (నెలల వారీగా..)

**14 జూలై**

➤ పశుసంవర్ధక శాఖలో తన ఇద్దరు కుమారులు పనిచేస్తున్నారని, తనకు క్షయ వ్యాధి రావడంతో ఇంటి నుంచి తరిమేసి అన్యాయం చేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోడుమూరు మండలం మెరుగుదొడ్డి గ్రామానికి చెందిన హనుమంతు కోరారు.

**4 ఆగస్టు**

➤ కుమారుడు వెంకటేశ్వరాచారి తన బాగోగులు పట్టించుకోకుండా కర్నూలు ప్రభుత్వాసుపత్రి వద్ద రోడ్డుపై వదిలేసి వెళ్లాడని కర్నూలు ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన మునెమ్మ ఫిర్యాదు చేశారు.

**18 ఆగస్టు**

➤ కొడుకు, కోడలు తమపై దాడి చేసి పాదుపులో వచ్చిన డబ్బులు లాక్కున్నారని తుగ్గలి మండలం గుండాలతండాకు చెందిన దానమ్మ, రాముడు నాయక్ దంపతులు ఫిర్యాదు చేశారు.

**25 ఆగస్టు**

➤ తనకు జీవనాధారంగా ఉన్న ఆస్తిని కుమారుడు, కోడలు కలసి రాయించుకోవాలని ఒత్తిడి చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మిగనూరుకు చెందిన ఈరమ్మ ఫిర్యాదు చేశారు.

**1 సెప్టెంబర్**

➤ ఆస్తులు రాయించుకుని కుమారుడు, చిన్న కోడలు అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, న్యాయం చేయాల్సిందిగా కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన బీసీ రామలింగం అధికారులను వేడుకున్నారు.



పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు తన సమస్యను విన్నవిస్తున్న వృద్ధురాలు (ఫైల్)

### ఇదీ చట్టం

జిల్లాలో వృద్ధులు ఐదు లక్షల మంది ఉంటారు. వీరిలో చాలా మంది కొడుకులు, కూతుర్లు, కోడళ్లు, మనువళ్లు, మనువరాళ్లకు ఆస్తిని బదలాయించి వారే తమ జీవిత చరమాంకంలో బాగోగులు చూసుకుంటారని అనుకొని ఉంటారు. అయితే అనుకోని పరిస్థితుల్లో వాళ్లే వృద్ధులను ఇంటి నుంచి గెంటివేయడం, అన్నం పెట్టకపోవడం, వసతి ఏర్పాటు చేయకపోవడంతో సమస్య తలెత్తుతోంది. అయితే ఇలాంటి వారికి చట్ట ప్రకారం పూర్తి భద్రత ఉంది. సబ్ డివిజినల్ అధికారి లేదా ఆర్‌డీఓను సంప్రదిస్తే న్యాయం జరుగుతుంది. ఆ అధికారులు సంబంధిత తల్లిదండ్రుల పిల్లలను పిలిపించి మాట్లాడతారు. వారికి వసతి, భోజనం, ఇతర అవరాసల కోసం నెలకు కొంత మొత్తాన్ని ఇవ్వాలని ఆదేశాలు జారీ చేస్తారు. వాటిని పిల్లలు పాటించకపోతే తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించిన ఆస్తిని తిరిగి బదలాయించే అధికారం సబ్ కలెక్టర్/ఆర్‌డీఓలకు ఉంటుంది. అయితే ఆ విధంగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడంలేదు. ఫలితంగా వృద్ధులు చివరి దశలో ఇబ్బంది పడుతున్నారు.

### పెరుగుతున్న వృద్ధాశ్రమాలు

జిల్లాలో వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయి. గతంలో ఇవి ఐదు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం వీటి సంఖ్య 20 వరకు చేరింది. మెప్మా ఆధ్వర్యంలో నాలుగు, ప్రైవేట్‌లో ఆరు వృద్ధాశ్రమాలు నడుస్తున్నాయి. పిల్లలు డబ్బులు కడితే తల్లిదండ్రులకు ఇచ్చేవి ఆరు ఉన్నాయి. దాతలు సహకారంతో నాలుగు నడుస్తున్నాయి. ప్రతి ఆశ్రమంలో 20 నుంచి 30 మంది వరకు వృద్ధులు ఉంటున్నారు. వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు.

### తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలదే



జీవిత చరమాంకంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలదే. తల్లిదండ్రుల నుంచి ఆస్తులు తీసుకొని వారి పోషణ, బాధ్యతను వదిలివేయడం అన్యాయం. వృద్ధులది చంటి పిల్లల మనస్తత్వం. వారికి కోపం ఎక్కువ, ఆవేశం అధికం. అయినా పిల్లలు ఓపికతో తల్లిదండ్రులను చూసుకోవాలి. నేడు సమాజంలో ఒకరిని చూసుకొనిమరొకరు తల్లిదండ్రుల బాధ్యతను మరుస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు.

–రంగారెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు, కర్నూలు

### అధికారం ఆర్‌డీఓలకు ఉంది



తల్లిదండ్రుల సంరక్షణ నుంచి పిల్లలు వైదొలిగితే చట్టం ప్రకారం వారికి న్యాయం జరుగుతుంది. వారి నుంచి సంక్రమించిన ఆస్తిని తిరిగి బదలాయించే అధికారం సబ్ కలెక్టర్లు/ఆర్‌డీఓలకు ఉంది. బాధిత వృద్ధులు ఆర్‌డీఓలను ఆశ్రయిస్తే తల్లిదండ్రులు, పిల్లలకు మొదట కౌన్సెలింగ్ నిర్వహించి పోషణ బాధ్యతను చూసుకోవాలని చెప్పుతారు. వారు చూసుకోకపోతే వారి జీవనం కోసం నెలకు కొంత మొత్తాన్ని పిల్లలు చెల్లించేలా ఆదేశాలు ఇస్తారు. అప్పుడు కూడా వారు పాటించకపోతే ఆస్తిని రద్దు చేస్తూ ఆర్‌డీఓలు ఆదేశాలు జారీ చేస్తారు. వృద్ధులు భయపడాల్సిన పనిలేదు. ఎవరికైనా ఇబ్బందులు ఉంటే నేరుగా సబ్ కలెక్టర్లు/ఆర్‌డీఓలను ఆశ్రయించవచ్చు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చే వృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ బి.నవ్య, జేసీ, కర్నూలు

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

పెద్దకడబూరు: భారీ వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి డిమాండ్ చేశారు. పెద్దకడబూరు మండలంలోని కంబళదిన్నె గ్రామంలో వర్షాలతో దెబ్బతిన్న పంటలను గ్రామ నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్షలాది రూపాయలు అప్పులు చేసి, ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతి కొచ్చే సమయంలో భారీ వర్షాలు రైతులను నట్టేట ముంచాయన్నారు. పంటలు అమ్ముకుని అప్పులు తీర్చుకుందామనుకుంటే వర్షాలతో కనీసం పెట్టుబడి కూడా రాకుండా పోయిందన్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక ఉల్లి పంటను రైతులు దున్నేయడంతోపాటు పశువులకు వదిలేయాల్సి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి అప్పులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. అధికారులు పొలాల్లో పర్యటించి రాజకీయ జోక్యం లేకుండా పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,, జాము మూకయ్య, ముక్రన్న, అర్లప్ప, పూజారి ఈరన్న, రైతులు ఉన్నారు.

### 8 వరకు పొడి వాతావరణమే!

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఈ నెల 8వ తేది వరకు పొడి వాతావరణం ఉండే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతల తీవ్రత కూడా ఎక్కువగానే ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల నుంచి 35.7 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 22.9 నుంచి 23.3 డిగ్రీలు నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. గాలులు గంటకు 9–10 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

### 8 నుంచి ఆధార్ క్యాంపులు

కర్నూలు(అర్బన్): తపాలా వారోత్సవాల్లో భాగంగా ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలను అందించేందుకు ఈ నెల 8 నుంచి 14వ తేది వరకు ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని విద్యార్థులకు మూడు స్కూల్స్‌లో క్యాంపులను నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8, 9వ తేదిల్లో బాలాజీ నగర్ భాష్యం స్కూల్.. 10, 11 తేదిల్లో వెంకటరమణ కాలనీ ఎంపీహెచ్‌ఎస్ స్కూల్.. 13, 14వ తేదిల్లో సంకల్‌బాగ్ భాష్యం స్కూల్‌లో క్యాంపులను ఏర్పాటు చేస్తామన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో పౌరులందరికీ ఆధార్ నమోదు, జనాభా సంబంధిత, బయోమెట్రిక్ అప్‌డేట్స్, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మొత్తం తొమ్మిది రకాల సేవల్లో మూడింటిని ఉచితంగా, మిగిలిన ఆరు రకాల సేవలకు నామమాత్రపు రుసుమును వసూలు చేస్తారన్నారు.

# శ్రీమఠానికి పోటెత్తిన భక్తులు



ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి భక్తులు పోటెత్తారు. దసరా సెలవులు కావడంతో శనివారం భక్తులు లక్షకుపైగా తరలివచ్చారు. తమిళనాడు, కర్ణాటక, తెలుగు రాష్ట్రాల భక్తులు స్వామి సేవలో తరించారు. తుంగభద్ర నదీ తీరం, మధ్వ కారిడార్, శ్రీమఠం ప్రాంగణంలో భక్తుల కోలాహలం కనిపించింది. రాఘవేంద్రుల మూల బృందావన దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. భక్తుల రాకతో భోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్లలో రద్దీ నెలకొంది.

# సాగు 'విష'తుల్యం!

- పెరిగిన రసాయన ఎరువుల వినియోగం




కర్నూలు(అగ్రికల్చర్): రసాయన ఎరువుల వినియోగం భారీగా పెరిగింది. సాధారణంగా సాగు విస్తీర్ణం పెరిగినప్పుడు ఎరువుల వినియోగం కూడా అధికమవుతుంది. 2024 ఖరీఫ్‌తో పోలిస్తే 2025 ఖరీఫ్‌లో 19,659 టన్నుల ఎరువుల వినియోగం పెరిగింది. 2024 ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే 2025 ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. 2024 ఖరీఫ్‌లో 4,22,481 హెక్టార్లలో సాగయింది. 2025 ఖరీఫ్‌లో 3,75,752 హెక్టార్లకే సాగు పరిమితమైంది. అయినప్పటికీ ఎరువుల వినియోగం మాత్రం భారీగా ఉండటం గమనార్హం. 2019–20 నుంచి 2023–24 సంవత్సరం వరకు తగ్గుతూ వచ్చిన రసాయన ఎరువుల వాడకం 2024–25లో పెరగడం ఆందోళన కలిగిస్తోంది. పత్తి, వరి, మొక్కజొన్న, ఉల్లి, మిర్చి, కంది తదితర పంటల్లో ఉత్పాదకతను పెంచుకునేందుకు రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగించినట్లు స్పష్టమవుతోంది. గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈ సారి జిల్లాలో 19,659 టన్నుల ఎరువుల వాడకం అధికంగా నమోదైంది. యూరియా సహా అన్ని రకాల ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగింది. సాధారణంగా నీటివసతి కింద సాగు చేసే పంటలకు ఎరువుల వినియోగం ఎక్కువగా.. వర్షాధారం పంటలకు తక్కువగా వినియోగిస్తారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో రెండింటిలో ఎరువుల వినియోగం పెరిగిపోయింది. పెట్టుబడులు ప్రధానంగా రసాయన ఎరువుల కోసమే వినియోగించినట్లు తెలుస్తోంది. అధిక వర్షాలతో రసాయన ఎరువులు వరదల రూపంలో బయటికి వెళ్లిపోయాయి. వరుసగా రెండు నెలలు అధిక వర్షాలు పడటంతో పంటల పరిస్థితి దయనీయంగా మారింది. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా రసాయన ఎరువులను వినియోగించాల్సి ఉన్నా ఆ దిశగా రైతులను చైతన్యం చేయకపోవడం గమనార్హం.

**రసాయన ఎరువుల వినియోగం ఇలా..**

| ఎరువు పేరు | 2024లో ఖరీఫ్‌లో ఎరువుల వినియోగం (టన్నుల్లో) | 2025 ఖరీఫ్‌లో ఎరువుల వినియోగం (టన్నుల్లో) |
|---|---|---|
| యూరియా | 38,031 | 46,219.8 |
| డీఏపీ | 10,824 | 13,471 |
| ఎంవోపీ | 927.9 | 1637.98 |
| కాంప్లెక్స్ | 76,946.8 | 86,490.6 |
| ఎస్‌ఎస్‌పీ | 1431.8 | 482.5 |
| కంపోస్ట్ | 3.75 | 5 |
| మొత్తం | 1,28,165 | 1,47,824 |

# రమణీయం.. రథోత్సవం



సింహాసన కట్టపై ఉత్సవమూర్తులు



భక్తజనం మధ్య మాళమల్లేశ్వరస్వామి రథోత్సవం

హొళగుంద: అశేష భక్తజనం మధ్య దేవరగట్టులో శ్రీమాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం రమణీయంగా సాగింది. కొండపై కొలువైన శ్రీమాతమాళమ్మ, మల్లేశ్వర స్వామిల విరాట్‌మూర్తులకు ఉదయం అర్చకులు పూజలు చేశారు. అనంతరం మల్లప్ప గుడిలోని సింహాసన కట్టపై కొలువుదీరిన ఉత్సవమూర్తులకు అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించారు. సంప్రదాయ ప్రకారం సాయంత్రం బిలేహాళ్ గ్రామం నుంచి దేవరగట్టుకు కుంభం, గజమాల వచ్చింది. రథాంగ, ఇతర ప్రత్యేక పూజలనంతరం స్వామివారి రథోత్సవాన్ని అశేష భక్త జనుల జయజయ ధ్వనుల మధ్య ప్రారంభించారు. భవిష్యవాణి వినిపించే ఎదురు బసవన్నగుడి వరకు రథోత్సవం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన చిన్నారులు, పెద్దలు రథం ముందు కోలాటాలు, ఇతర నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాన్ని తిలకించడానికి విరుపాపురం, సుళువాయి, బిలేహాళ్, నిట్రవట్టి, కురుకుంద, ఆరికెర, అరికెరతండా తదితర గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ రవి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ దిలీప్‌కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## క్లుప్తంగా

### నాలుగు కోర్సుల్లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఏక కాలంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ తెలిపారు. టైలరింగ్, జ్యూట్ బ్యాగ్స్, ఎంబ్రాయిడరీ–మగ్గం వర్క్, బ్యూటీపార్లర్ అంశాలలో శిక్షణ ఇస్తున్నట్లు శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైలరింగ్‌లో 31 రోజులు, జ్యూట్‌బ్యాగ్స్ తయారీలో 14 రోజులు, ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్‌లో 31 రోజులు, బ్యూటీపార్లర్‌లో 35 రోజుల పాటు శిక్షణనిస్తామన్నారు. ఈ నెల 21 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చిన మహిళలు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 9000710508, 6304491236, 08518-273710ను సంప్రదించాలని పేర్కొన్నారు.

### గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమర వనుములపాడు సమీపంలో కేసీ కాలువలో కొత్త తూము వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఇన్‌చార్జ్ ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలి శరీరంపై ఎర్రటి లంగా, ఎర్రటి జాకెట్, నల్లటి పూసల తాడు, కాలి మెట్టెలు మాత్రమే ఉండి గుర్తు పట్టలేనంతగా శరీరం ఉబ్బి కుళ్లిపోయింది. ఆమె వయస్సు సుమారు 40 – 50 ఏళ్ల మధ్య ఉంటుంది. వీఆర్వో భగవాన్‌దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ఎక్కడైన మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేయించిన వారు ముచ్చుమర్రి ఎస్ఐ 9121101188, నందికొట్కూరు రూరల్ సీఐ 9121101186కి సమాచారం ఇవ్వాలన్నారు.

### కర్ణాటక వాసి ఆత్మహత్యాయత్నం


బాధితుడితో మాధవరం పోలీసులు

మంత్రాలయం రూరల్: కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న కర్ణాటక వాసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కర్ణాటకలోని దావణగేరి ఇందిరాగాంధీ లేఅవుట్‌కు చెందిన సంగప్ప కుమారుడు శంకర్ (38) ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సమస్యలతో ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇదే క్రమంలో తండ్రి సంగప్ప చేసిన అప్పుల బాధలు పెరగడంతో తనువు చాలించాలని శనివారం మంత్రాలయం చేరుకున్నాడు. సమీపంలోని తుంగభద్ర నదిపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జి దగ్గరకు వెళ్లి నదిలో దూకాడు. గమనించిన స్థానిక రైతులు పోలీసులకు చెప్పడంతో వారు వెంటనే స్పందించారు. జాలర్ల సాయంతో శంకర్‌ను క్షేమంగా బయటకు తీసుచ్చారు. వివరాలు తెలుసుకుని అతని కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.


క్రీడోత్సాహం.. పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు


డ్రాగన్ వేగంతో.. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు


నువ్వా.. నేనా.. లక్ష్యం వైపు దూసుకెళ్తూ..

## 'జల'కేతనం

నగర శివారులోని సిటీ ఫారెస్ట్ చెరువులో శనివారం జూనియర్స్, సీనియర్స్ స్త్రీ, పురుషుల విభాగాల్లో నిర్వహించిన 4వ అంతర్రాష్ట్ర కనోయింగ్ కయాకింగ్ బోట్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగాయి. రాష్ట్ర కెనోయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన క్రీడాకారుల కుటుంబీకులు, స్థానికులు ఆసక్తిగా తిలకిస్తూ చప్పట్లు, కేకలతో హోరెత్తించారు. చెరువులో పడవ పోటీలు నగర వనానికి విచ్చేసిన పర్యాటకులను మరింత ఆకట్టుకున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


కయాక్ బోటును నీటిలో రొటేట్ చేస్తూ ..


అందాల తీరంలో క్రీడా పోటీలు

# జల క్రీడల హబ్‌గా కర్నూలు



పోటీల ప్రారంభంలో మాట్లాడుతూ డీఎస్‌డీఓ భూపతిరావు, హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

కర్నూలు (టౌన్): రాష్ట్రంలోనే జల క్రీడలకు హబ్‌గా కర్నూలు నిలుస్తుందని జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. శనివారం కర్నూలు సిటీ ఫారెస్టు (గార్గేయపురం) చెరువులో 4వ అంతర్రాష్ట్ర స్థాయి కెనోయింగ్, కయాకింగ్, డ్రాగన్ బోట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. నూతన క్రీడలను అభివృద్ధి చేసేందుకు జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు చేస్తున్న కృషి వెలకట్టలేనిదన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించినప్పుడే భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి చేయూత అందిస్తామన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంత రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో విజయ్ కుమార్ మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రమం తప్పకుండా సాధన చేయాలన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరించినప్పుడే క్రీడల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో కెనోయింగ్, కయాకింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు శివారెడ్డి, ఆంధ్రప్రదేశ్ డ్రాగన్ బోట్ అసోసియేషన్ కార్యదర్శి మంచికంటి అవినాష్, కర్నూలు జిల్లా వాటర్ స్పోర్ట్స్ కోచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నివారణ చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(సెంట్రల్): సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, అకృత్యాలు, బాల్య వివాహాలు, దళిత, గిరిజనులపై జరిగే కుల దూషణలు, దాడులను అరికట్టే చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి బి.లీలావెంకట శేషాద్రి అధికారులకు సూచించారు. శనివారం కల్లూరులోని ముజఫర్ నగర్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బుడగ జంగాలలు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులు, ప్రోత్సాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గిరిజన. దళిత వర్గాల వారికి ఉచిత న్యాయ సహాయం, విద్యా హక్కు కోసం 1098 హెల్ప్‌లైన్, మహిళా నంబర్ 181, న్యాయ సహాయం కోసం 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నంబర్ 14456 తదితర హెల్ప్‌లైన్ నంబర్లను ఆశ్రయించి న్యాయ సేవలను పొందచ్చన్నారు. అనంతరం బాల్య వివాహ నిరోధక చట్టం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జ్యుడిషియల్ ఆఫీసర్లు కె.హేమ, ఎస్.లక్ష్మీ,జి. అపర్ణ, పి.హేమ తదితరులు పాల్గొన్నారు.

## విరిగిన ఆర్టీసీ బస్ స్టీరింగ్ రాడ్

- డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ప్రమాదం


విరిగి పోయిన స్టీరింగ్ రాడ్


ఎండలో ప్రయాణికుల నిరీక్షణ

దొర్నిపాడు: దొర్నిపాడు శివారులో ఆర్టీసీ బస్సుకు శనివారం ప్రమాదం తప్పింది. ఆళ్లగడ్డ నుంచి కోవెలకుంట్లకు సుమారు 50 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయలు దేరింది. దొర్నిపాడుకు చేరుకోగానే ఒక్కసారిగా బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో డ్రైవర్ ఎంతో చాకచక్యంగా బస్సును నిలిపి వేయడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకుని బయటకు దిగారు. కానీ మరో బస్సు చాలా సేపటికి కూడా రాకపోవడంతో ప్రయాణికులు చిన్నారులతో ఎండలో నిల్చోవాల్సి వచ్చింది. కాసేపటికి మరో బస్సులో తమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

## గాంధీనగర్‌లో చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని గాంధీనగర్‌లో తాళం వేసిన ఇంటిని దొంగలు కొల్లగొట్టారు. పెద్దకడుబూరు మండలం కంబదలహాళ్‌లో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న వసంతలక్ష్మి ఎమ్మిగనూరు గాంధీనగర్‌లో నివాసముంటోంది. దసరా సెలవులకు సొంతూరు గుంటూరుకు వెళ్లి శనివారం తిరిగి వచ్చింది. ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో 6 తులాల బంగారు ఆభరణాలు, రూ.14 వేల నగదు చోరీకి గురైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

## చెరుకులపాడులో బరితెగించిన తెలుగుతమ్ముళ్లు

- తిరగబడిన బాధితురాలు, పోలీసులకు ఫిర్యాదు
- టీడీపీ నాయకుల రంగ ప్రవేశం.. రాజీ ప్రయత్నం
- కేసు నమోదులో తాత్సారం

# ఎస్టీ మహిళపై అత్యాచారయత్నం

వెల్దుర్తి: మండలంలోని చెరుకులపాడు గ్రామంలో ఓ ఎస్టీ మహిళపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. దీంతో మహిళ తిరగబడి, పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదులో తాత్సారం జరుగుతోంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహిళ భర్త, పిల్లలతో కలిసి కూలీ, ఇతర పనులతో జీవనం సాగిస్తోంది. గత నెల 26న గ్రామ సమీపంలో దుస్తులు ఉతికేందుకని వెళ్లింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు బోయ శివ, బోయ మహేంద్ర ఆమెతో అసభ్యంగా మాట్లాడి అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. ఆమె తిరగబడడంతో వెనుతిరిగారు. రెండ్రోజుల అనంతరం ఆమె ఇంటి వద్దకు వచ్చిన ఆ ఇద్దరూ మహిళతో అసభ్యంగా మాట్లాడారు. దీంతో ఆమె నిందితుల ఇళ్ల వద్దకు వెళ్లి దండించే ప్రయత్నం చేయగా వాళ్ల కుటుంబ సభ్యులు ఆరుగురు ఆమెను అసభ్యంగా నిందించి గెంటేశారు. ఈ క్రమంలో స్వల్ప ఘర్షణ జరిగింది. ఇదంతా భర్తకు తెలిపిన బాధితురాలు ఈనెల 1న వెల్దుర్తి పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ దేవరగట్టు బందోబస్తుకు వెళ్లడంతో సిబ్బంది నిర్లక్ష్యం చేశారు. నిందితులు చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో నిందితుల బంధువులు, టీడీపీ కార్యకర్తలు కావడంతో ఆ పార్టీ మండల నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగి రాజీ ప్రయత్నాలు చేశారు. పోలీసులు సైతం రాజీ ప్రయత్నాలతో కేసు నమోదులో తాత్సారం చేసినట్లు తెలిసింది.

### పోలీసులు కేసు నమోదు చేయాలి

ఎస్టీ మహిళను బలాత్కరించబోయిన నిందితులపై వెల్దుర్తి పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకోవాలి. లేకపోతే న్యాయపరంగా ప్రైవేట్ ఫిర్యాదు చేస్తాం. కూటమి ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పిస్తామని, అన్యాయం జరిగితే వెంటనే చర్యలు తీసుకుంటామని గొప్పలు చెప్పడమే తప్ప చేతల్లో మాత్రం ఆడపడుచుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారు.

– పట్నం రాజేశ్వరి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్య వేదిక నాయకురాలు

## స్కానింగ్ సెంటర్లను రెన్యువల్ చేసుకోవాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

గోస్పాడు: స్కానింగ్ సెంటర్లను ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. నంద్యాల డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం జిల్లా మల్టీ మెంటల్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. కొత్తగా స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేసే వారు తప్పని సరిగా జిల్లా కమిటీ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్లను ప్రోగ్రాం అధికారులు మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయాలన్నారు. జిల్లా వైద్య శాఖ వద్ద అనుమతి పొందిన తర్వాతే స్కానింగ్ మిషన్లను కొనుగోలు చేయాలని, లేదంటే పీసీ అండ్ పీఎన్‌డీ యాక్టు 1994, 1996 ప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారు, ప్రోత్సహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ జయరాం, సొసైటీ ఎన్‌జీఓ డాక్టర్ రాజశేఖర్, ఇన్‌చార్జి డెమో రవీంద్రనాయక్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# త్యాగం పల్లెవించి.. విజయం విరాజిల్లి

- గ్రామంలో 80 శాతం ఇంటికో ఉద్యోగస్తుడు
- డీఎస్సీలో సత్తా చాటిన పౌరుషాల గడ్డ తెర్నేకల్ వాసులు
- 21 మంది టీచర్ పోస్టుకు అర్హత సాధించిన వైనం
- జెడ్పీ హైస్కూల్‌లో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తూ..


తెర్నేకల్ గ్రామ జెడ్పీ ప్రభుత్వ పాఠశాల

ఆలూరు రూరల్/దేవనకొండ: తెల్లదొరలు ఎక్కుపెట్టిన తుపాకులకు ఎదరు నిలిచి భారత్ మాతాకీ జై అంటూ.. రొమ్ము చూపించిన పౌరుషాల గడ్డ ఇది. స్వాతంత్ర్యం కోసం వేలాది మంది ఆ గ్రామస్తులు ప్రాణ త్యాగం చేశారు. నాటి పౌరుషాల గడ్డ ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల అడ్డాగా మారింది దేవనకొండ మండలంలోని తెర్నేకల్ గ్రామం. మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ ఇది. ఈ గ్రామంలోని యువత ఆదర్శంగా నిలుస్తోంది. వారి తల్లిదండ్రుల కన్నకలలను సాకారం చేస్తూ.. విజయం తీరం చేరుకుంటున్నారు. ఈ గ్రామం నుంచి దాదాపు 150 మంది ఉపాధ్యాయ వృత్తిలో పని చేస్తుండగా.. పోలీసు శాఖలో ఎస్పీ స్థాయి నుంచి కానిస్టేబుల్ స్థాయిలో పనిచేస్తున్న వారు 50 మంది దాకా ఉన్నారు. అలాగే ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లో గ్రూప్–1, 2 స్థాయిలో ఉద్యోగం చేస్తున్నారు. 4వ తరగతి ఉద్యోగులు, ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలో పనిచేసే వారు ఇంటికొకరు చొప్పున ఉన్నారు. గ్రామ జనాభా 7 వేలు. గ్రామంలో 2,500 ఇళ్లు ఉన్నాయి. 60 శాతం వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామ సమీపంలోనే హంద్రీ కాలువ ప్రవహిస్తోంది. ఈ గ్రామానికి 480 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ మెరిట్ జాబితాలో ఈ గ్రామానికి చెందిన 21 మంది ఉపాధ్యాయ పోస్టులు సాధించారు. అందరూ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారే కావడం విశేషం. టీచర్ పోస్టులకు అర్హత సాధించిన వారందరూ గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారు.

### పౌరుషాల గడ్డ చరిత్ర ఇది..


గ్రామంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు ముత్తుకూరు గౌడప్ప విగ్రహం

తెర్నేకల్ గ్రామం చరిత్ర పుటల్లో వెతికితే ఇట్టే కనిపిస్తోంది. స్వాతంత్ర్య సమరంలో ఈ గ్రామస్తులు తమ ప్రాణాలను అర్పించారు. 1801లో గ్రామస్తులు తమ భూమల శిస్తు చెల్లించలేమని ముత్తుకూరు గౌడప్ప ఆధ్వర్యంలో బ్రిటీషు వారిపై తిరుగుబాటు చేశారు. ఈ నేపథ్యంలో జరిగిన సమయంలో గ్రామస్తులు వందలాది మంది తనువు చాలించారు. బ్రిటీషు సైనికులు అఘాయిత్యానికి పాల్పడుతుండగా మహిళలు గ్రామంలో బోడెప్ప బావిలో దూకి ప్రాణాలు విడిచారు. స్వాతంత్ర్య పోరాట యోధుడు ముత్తుకూరు గౌడప్ప పోరాటానికి గుర్తుగా గ్రామంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు.

### బడి తెచ్చిన మార్పు..

తెర్నేకల్ గ్రామంలో 1961లో సమితి అధ్యక్షుడిగా ఉన్న పాటిల్ సోమిరెడ్డి పాఠశాలకు 5 ఎకరాల స్థలం దానంగా ఇవ్వడంతో ప్రభుత్వం బడిని నిర్మించింది. దీంతో గతంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించిన తెర్నేకల్ వాసులు పాఠశాల ఏర్పాటు కావడంతో తమ పిల్లలను బాగా చదివించుకునే అవకాశం దక్కింది. ఆ గ్రామానికి ఆనుకొని హంద్రీ కాలువ ప్రవహిస్తుండడంతో గ్రామ రైతులు ఉల్లి, పత్తి, వరి, వేరుశనగ వంటి తదితర పంటలు సాగు చేసి జీవనం సాగిస్తూ..తమ పిల్లలను ప్రయోజకులను చేసుకుంటున్నారు. బ్రిటీషు వారి బానిసత్వ సంకెళ్లు తెంచుకుని ప్రగతి బాట పట్టిన గ్రామం ఏదైనా ఉందంటే అది దేశంలోనే తెర్నేకల్ కూడా ఒకటి. ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో తెర్నేకల్ గ్రామానికి చెందిన 21 మంది ఉపాధ్యాయ పోస్టులు సాధించడంతో ఈ గ్రామం ఆదర్శంగా నిలిచింది.